

# లేఖాయణం

## ఉమ యేలూరి



*మనిషి మనసులోని భావాలకి ప్రతి రూపం, మనసులోని మాటలకి మరోరూపం ఉత్తరాలు. కార్డు, కవరు, ఎయిర్ మెయిల్, ఇ-మెయిల్, ఎస్.ఎం.ఎస్..ఎన్ని రూపాలు మార్చుకున్నా మనిషి ఎదురుగా చెప్పలేని భావాలకి అక్షర రూపం కల్పించడం ఒక కళ..! నెలనెలకీ కొన్ని ఉత్తరాల పరంపరని ఈ నెల నుంచీ ఈ శీర్షికలో మీరు చదువుతారు. వ్రాసేది, అందుకునేది ఎవరైనా కావొచ్చు.. అమ్మా, నాన్న, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు, వదినా, మరదలు, బావా, నేస్తం, అనామిక, ప్రేయసి... ఎవరైనా.. ఒక్కో ఉత్తరంలో ఎన్నో భావాలు..కనిపించని కథలు, వినిపించని మౌన రాగాలు..! రచయిత్రి ఉమ గారు, ‘భావన‘ కలం పేరుతో* **http://kristnapaksham.blogspot.com/** *బ్లాగుని కూడా వ్రాస్తున్నారు.*

## మారిన విలువలు

*అన్నయ్య,*

ఎలా వున్నావురా..? నేను చాలా బాగున్నా (అదే నీ దృష్టిలో ఏడ్చినట్టు) :-)

అమ్మ వాళ్ళు ఎలా ఉన్నారు? నాన్న చాలా సంతోషంగానే ఉండి ఉంటాడు.. నీ దగ్గరకదా ఉంది. అమ్మకు నాన్న సంతోషం తప్ప ఏమీ అక్కర్లేదు కాబట్టి ఆమె సంతోషంగానే ఉండి ఉంటుంది. "సర్వేజనా సుఖినోభవంతు" అని ముగించెయ్యవచ్చు ఈ ఉత్తరాన్ని ఇక్కడికి, కాని నా ఈ ఉత్తరం ఉద్దేశం అదికాదు కాబట్టి ఇంకా రాస్తున్నా. అసలు రాత్రి ఫోన్ చేద్దామనుకున్నా కాని నీ దొరతనం బైట వెలగబెట్టి కొంపకు చేరే సరికి ఏ అర్ధరాత్రో అవుతుంది, అప్పుడు మాట్లాడే ఓపిక నీకు ఉండదు అని ఉత్తరం రాస్తున్నా...

ఒరే అన్నయ్య గుర్తుందా మనం చిన్నప్పుడు, నాకు తొమ్మిదేళ్ళు, నీకు పదిహేను ఏళ్ళువుండి ఉంటాయి అప్పుడు, నాకు సైకిల్ నేర్పటానికి నువ్వు నీ ఫ్రెండ్ కృష్ణా ప్రయత్నిస్తున్నారు. నేను అరుస్తున్నాను.... మీమీద  నేను ఆధారపడి అసలు సరిగా నేర్చుకోవటం లేదు అని ఉన్నట్లుండి వదిలేసారు నాకు చెప్పకుండా, కొంచెం సేపు అయ్యాక చూసుకుంటే మీరు లేరు దెబ్బకు భయపడి, నేను వెళ్ళి మన వీధి చివర శంకర్రావుగారి ఇంటి ముందట ముళ్ళ గోరింత పూలచెట్టు మీద పడ్డాను. నేను ఏడుస్తుంటే వచ్చి ఏమన్నావో గుర్తుందా..? ‘వ్యక్తి స్వాతంత్ర్యం సాధించాలంటే ములుకు మాటలు, ముళ్ళ మార్గాలు కూడా ఉంటాయి తీసి పారెయ్యాలి కానీ ఇలా ఏడిస్తే ముళ్ళు ఇంకా నెప్పెస్తాయి‘ అని.. నాకు అప్పట్లో పూర్తిగా అర్ధంకాక పోయినా, నీ మాట మాత్రం గుర్తువుండి పోయింది. తరువాత ఇంటికి వచ్చాక నాన్న "ఆడముండకు ఈ సైకిళ్ళు.. గోలా ఎందుకురా" అని తిడుతుంటే అంటే ఎంత రోషపడ్డావో.. నన్ను ఇంటి వెనుక బాదం చెట్టు దగ్గరకు తీసుకుని వెళ్ళి నాతో ఒట్టు పెట్టించుకున్నావు గుర్తుందా "ఎప్పటికి ఈ ఆడదాన్ని అనే బేలతనం, నా పని కాదు అనే అధైర్యత రానివ్వను నా జీవితంలో" అని, అప్పట్లో ఆ ప్రమాణంకు అర్ధం ఏమిటో తెలియకపోయినా నీ కళ్ళలో నీళ్ళు చూసి ఏడుస్తూ ఒట్టు పెట్టాను.. ఇప్పుడు తలుచుకున్నా ఎంత సంతోషంగా ఉంటుందో నాకు, నీలాంటి అన్నయ్య నాకు తోడుగా ఉన్నాడు అని. అప్పుడనే కాదు పెద్ద అయ్యేదాక ఎన్నిసార్లు నాకు ఎన్ని తెలియనివి తెలియచెప్పావురా...

ఇవి అన్ని ఇప్పుడు ఎందుకు గుర్తుచేస్తున్నావు అంటావా.. "చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా.... గతమెంతో ఘనకీర్తి కలవోడా" అని పాడుకుంటానికి తప్ప ఎందుకు ఉపయోగం లేని మనకీర్తల్లే మన గత అనుభవాలు అవ్వకూడదనిపించింది....

జీవితంలో నిరాసక్తత మొదలయ్యి నిర్లిప్తత మన జీవన పదమవుతుందో, అవకాశవాదం అలవాట్లను, ఆనందాలను మింగేసి మనలను మాయావిలువలున్న లోకాన్నే శాశ్వతమని భ్రమింప చేస్తుందో నాకు తెలియదు కాని - నీ విషయంలో ఏదో అయ్యింది అని మాత్రం తెలుసు, చిన్నప్పటినుంచి నాకు తెలిసిన నా అన్నయ్య ఎక్కడా కనిపించటంలేదు... ఆ స్థానాన నాన్నకు ప్రతిరూపం (మనం ఏదైతే కాకూడదని అనుకున్నామో), డబ్బుకు మారు రూపం ఐ కనపడుతున్నావు. అమ్మకు బదులు వదిన మార్పు అంతే... అదే కథ పునరావృతం...! నువ్వు మారని నాన్నకు ప్రతి రూపమై ఆ ఇంటిపేరు నిలబెడుతున్నాను అని అనుకుంటున్నావేమో కాని ఆ మూర్ఖత్వపు ఆనవాళ్ళను పతివ్రతా రూపంలో ధరించే అమ్మకు తరువాతి తరం వదిన అని గుర్తించలేకపోతున్నావు. *చెల్లి కళ్ళల్లో అసహాయత రానీయకూడదని ఆరాటపడిన నా అన్నయ్య, భార్య కళ్ళల్లో నీలినీడలు గుర్తించలేని గుడ్డివాడయ్యాడేమిటా అని ఆశ్చర్యంగా ఉందిరా... ఉహు... అవమానంగా ఉందిరా...*

మొదటిసారి నాలోని బలాన్ని... నా భావాలని తట్టిలేపి మార్క్సిజం నుంచి ఫెమినిజం దాకా పరిచయం చేసిన నా అన్నయ్యను ఆ ధృఢ వ్యక్తిత్వంతో మళ్ళీ చూడాలంటే, కొంప తీసి మళ్ళీ నిన్ను ఆ ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ మెట్లమీద నిలబెట్టాలా ఏమిరా? ఆలోచించు నువ్వే మరి పరిష్కారాన్ని కూడా..

*సాధన ఒక ప్రయత్నం, అర్థవంతమైన జీవనం జీవిత సాధనకు గమ్యం. భౌతిక లాభమే సాధించటం అంటే అని జన సామాన్యం అనుకోవటం మూలంగానే కొలతలు బేరీజులు మొదలయ్యి, అర్థం పరమార్థం మారి, జీవితంలో అసంతృప్తి జీవిత పథమవుతోంది అని జీవితవేదాంతాన్ని నాకు పరిచయం చేసిన నా మొదటి స్నేహితుడికి ఇంత కంటే ఏమి రాయగలనురా...* ఎంతో పౌరుషంగా నిన్ను మాటల తూటాలతో బాధపెట్టాలని మొదలుపెట్టి (నాకు తెలుసు ఇప్పటికి నీ వీక్నెస్ అదే అని) నాకు తెలియకుండానే ఏడుస్తు ముగిస్తున్నా...

ఉంటాను మరి... నీ చిరకాల స్నేహితుడు, నా సహచరుడు అడుగుతున్నాడు 'ఏమయ్యింది మీ అన్న గుర్తు వచ్చాడా?' అని. చూసేవా నా బలం, బలహీనత నా అన్నే అని కృష్ణకు కూడా తెలిసిపోయింది..

ఉండనా

ప్రేమతో

**నేను.**

ఒసేయ్ పిచ్చి,

నువ్వు ఇంకా మారలేదు, ఎప్పటికీ మారవే... ఐనా నీది కాదు తప్పు, నిన్ను చిన్నదానివని గారాబం చేసి అడిగినవి అన్ని ఇచ్చి ముద్దుచేసి నెత్తికెక్కించుకున్నాను చూడు నన్ను అనుకోవాలి, అది చాలదన్నట్లు మళ్ళీ ఆ సెంటిమెంటల్ ఫూల్ గాడిని పెళ్ళి చేసుకుంటాను అంటే ఒప్పుకుని చేసాను చూడు... అది ఇంకో తప్పు. సరేకాని, చేసినదానికి నువ్వు ఏమి రాసినా వినక తప్పుతుందా..

ఏమంటావే ఐతే ఇప్పుడు... పొద్దుగూకులు డబ్బు ధ్యాసలో పడి మీ ఒదినను పట్టించుకోలేదంటావు... మీ వదిన ఏదో నాతో చాలా కష్టపడిపోతుందంటావు... అంతేనా..? ఈ తాపత్రయం అంతా ఎందుకు చెప్పు.. దానికోసం, దాని పిల్లల కోసం కాదు.... ఇంతమాత్రానికే నన్ను అంత విలన్ను చేసేస్తున్నావు.

ఇంత వయసొచ్చాక కూడా ఇంత సున్నితమైతే నిన్ను కాదు... నీ మొగుడిని అనాలి, నిన్ను ఇంకా అంత గారాబం చేసి చెడగొడుతున్నందుకు. నీకులా అర్థరాత్రి వరకు చీకటిలో పువ్వులు చూడటం కోసం తోటలో కూర్చోవటం, తెల్లవారుఝామే, వేకువ అంచున చీకటి నురగను చూడటం కోసం సముద్రపుటొడ్డుకు పరుగెత్తటం ఇలాంటి వెర్రిమొర్రి పనులన్ని చేస్తూ కూర్చుంటే మీ ఒదిన సంతోషంగా ఉంటుందా....! అలా అని నీకు చెప్పిందా...! అది ఒక వెర్రిమాలోకం, నిన్ను చూడగానే దాని ఆనందం, నవ్వులు చూసినప్పుడే అనుకున్నా ఇలాంటివి ఏదో నూరిపోస్తున్నావు అని.

అమ్మా.... తల్లి.. దానికి లేనివి నేర్పి నా మీదకు ఉసిగొల్పమాకు.... ఏదో చిన్నప్పుడు, చదువుకునేప్పుడు ఏదో ఆలోచించాము, ఏవో మాట్లాడాము అని ఇక జీవితాంతం అలానే ఉండాలి అంటే ఎలా కుదురుతుంది చెప్పు.? పరుగెత్తి జీవితాన్ని అందుకోవాలే... అప్పుడే ఆ జీవితానికి అర్థం... పరమార్థం... ***పరుగెత్తి పాలు తాగలేని చవటలందరు ఇలా నిలబడి నీళ్ళు తాగటంలోని లేని ఆనందాన్ని తలుచుకుని మురుస్తూ ఉంటారు,*** ఇది ఈ కాలానికి మన వయసుకు తగిన జీవిత సిద్ధాంతం, వేదాంతం! అంతలా అన్నయ్య మాట వినే దానివైతే ఇకనైనా ఆ పిచ్చిగోల ఆపి, ఆ పనికిరాని టీచర్ ఉద్యోగం మాని పిల్లా పీచు రాకముందే గ్రూపు 2 పరీక్షలకు కూర్చుని పూర్తి చెయ్యి. తెలివంతా ఇలా ఎవరో రాసేసిన కవితల పుస్తకాలు చదవటంలో కాదు.. నీ భవిష్యత్తును నువ్వు సరిగా రాసుకోవటంలో చూపించవే పిచ్చి మొద్దు.

ఇదుగో ఇలా రాస్తుంటే తెల్లారుతుంది.. దీని బదులు కాసేపు ఏదైనా ఉపయోగపడే పని చేసుకుంటే పుణ్యం పురుషార్థం. రేపు మళ్ళీ ఆడిటింగ్ ఉంది, ఈ సంవత్సరం మన శ్యాంగారు, లలిత అక్కవాళ్ళ ఆఫీకు కూడా వస్తాను అని చెప్పాను. అవును అమ్మ ఒకటే గోల చేస్తోంది. కిందటి వారం వెళ్ళిన దగ్గరనుంచి నువ్వు ఒక్కసారి ఫోన్ కూడా చేయలేదంట, ఇంకో నెలలో ఏదో అన్నా చెల్లెళ్ళు బట్టలు పెట్టుకోవటం... ఏదో చెయ్యాలి అట, మీ ఒదినకు చెప్పాను.. మంచి చీర తీసుకోమని వీలున్నప్పుడు రా మరి... వాడిని, కృష్ణని కూడా రమ్మను మరీ బొత్తిగా నల్లపూసైపోయాడు.. వాడికోసం మొన్న ఎక్కడో దొరికితే నవీన్ "అంపశయ్య" తీసుకున్నా.

ఉంటాను మరి.

ప్రేమతో,

***అన్నయ్య.***

✡ ✡ ✡